# బతుకు చెరువు

బిడ్డికోడు గట్టుమీద పడ్డ చేపలా గిలగిలా గింజులాడేడు. ప్రాణం విలవిల్లాడుతున్నట్టు కాళ్ళూ చేతులూ తన్నుకోబోయేడు. కాని కాళ్ళూ చేతులూ కట్టేసినట్టు కన్నబిడ్డలు నలుగురూ ఆ ముసలిశరీరాన్ని కదలనివ్వకుండా పట్టుకున్నారు. బిడ్డకోడు ఆవేశంతో పెనుగులాడేడు. ఆయాసంతో అరచి గీపెట్టాడు. అమ్మా ఆలీచేసి అక్కడ చేరిన అంతమందినీ బూతులు తిట్టాడు. అలసి సొలసి అయ్యాబాబూ అని బతిమలాడుకున్నాడు. ఆఖరికి దుఃఖం పట్టలేక ఏడ్చాడు. గుండె బాదుకున్నాడు. అంతలోనే పూనకం వచ్చి పీనుగులా వున్నోడు ఏనుగులామారి, కదలనివ్వకుండా చుట్టుకున్నవారిని విసిరి కొట్టి నేలమీది మట్టి దోసిళ్ళతో తీసి పిచ్చివాడిలా నెత్తిమీద పోసుకున్నాడు. నింగిమీదకి విసిరాడు.

''కొండలంజకొడుకుని ఇక్కడ్నుంచి తీసికెళ్లండ్రా...''

ఆ మాటతో బిడ్డికోడి కొడుకులు కొండడు, బూగడు, లక్కాయ్, సాంబ అంతా కలిసి బిడ్డికోడ్ని బరబరా రెక్కలు పట్టుకు లాక్కెళుతున్నారు. గరకు నేలా మొక్కా మోడూ రాయిరప్పా గుట్టామెట్టా తగులుకుంటూ బిడ్డికోడి నల్లటి శరీరం పెచ్చులూడి ఎర్రని పూత పూసుకుంటోంది. అయినా బిడ్డికోడు ఈండ్రబడుతున్నాడు. మొలమీది గోసిగుడ్డ మట్టిగొట్టుకుపోయి, బిడ్డికోడి చర్మంలానే చివికి రేగిపోతున్నది.

అప్పుడే కొండమీద నుండి బంతిదొర్లినట్టు వచ్చింది- సిరిమిల. ఆమె వెనకాలే పెద్దకోడలు సుక్కి, రెండో కోడలు బూది, ఒక్కగానొక్క కూతురు లిక్కిడి వాగరుస్తూ వచ్చారు.

'' ఓలమ్మోలమ్మో... సంపేనారు. నామొగిడ్ని సంపేనారు..'' సిరిమిల గుండెబాదుకుంటూ బిడ్డికోడి దగ్గరకు వస్తూనే కొడుకుల్ని చూసి దూరంగా పరిగెడుతోంది. వంటిమీద కోకని ఈడ్చుకుపోతుందే గాని ఏగేసుకుందామన్న ధ్యాసలో కూడా లేదు. తల్లిని చూసి కూతురు లిక్కిడి 'ఒలమ్మోలమ్మో' ఏడుస్తూ తల్లిచుట్టూ పరుగుతీస్తోంది. ఆ పిల్ల వెనకాలే సుక్కి, బూది.

''వొద్దు.. వొద్దు.. ఏగయిర్నమెంటుగాడిద కొడుకుల్నీ నమ్మొద్దు.... వొద్దురొరే... ఈ కనికట్టు నమ్మొద్దురొరే.. ''బిడ్డకోడు పేగులు తెగేల ఏడుస్తున్నాడు. ఆ అరుపులకు చుట్టూవున్న కొండలు ప్రతిధనిస్తూ అదే మాటని పదే పదే అంటున్నాము

బిడ్డికి అరుపుల్ని, బిడ్డికితో గొంతుకలుపుతున్న కొండల ప్రతిధ్వనుల్ని మింగేస్తూ వికృత శబ్దం! గుజ్జువాయి కొండల్నీ గుజ్జుగుజ్జయిపోయే రొద!

పిండొడిం

బిడ్డికోడి నోరుపడిపోయింది. కాళ్ళూ చేతులూ అవిటివయి పోయాయి. ఏ చలనమూలేని శరీరం ఎటుపడితే అటు పడిపోతోంది. కళ నీళ్ళతో కరిగి ఎర్రబడి చెంపలు జోరికలు కట్టాయి! చూపు నమ్ముకున్న నేలమీదే! పుట్టిన మట్టిమీదే!!

ఎర్ర మట్టి మీద చోలు, జొన్న, కందులు ఇంకా నిలచిలేవు. మట్టికింద ఆ మొక్కలన్నీ తలలు వాల్చేస్తున్నాయి. మరోపక్క మామిడి, ఇప్పచెట్లు వెన్నువిరిగి మన్నుకిందమన్నె...

బుల్డోజరు భూమి పొరల్ని దొలుస్తూవుంది. ఆకలికి నోరు తెరిచిన రాకాసిలా పంటనంతా పుక్కిట పట్టినట్టు... ఏమొక్కనీ మోడునీ మిగలనివ్వకుండా తవ్వుకుపోతోంది. రాయీరప్పా ఏదీ కాదు అడ్డంకి. ఎడారిలా నున్నగా.. కొండని గుండు గీసినట్టు... గొయ్యితీసినట్టు...

ఆ గోతిలో పాతినట్టు బిడ్డికోడికి ఊపిరాడకుండా వుంది.

★★★

ఊరుకు నిప్పంటుకున్నట్టు... ఏరు వెంటబడి తరుముతున్నట్టు... ఊరంతా ఖాళీ చేసినట్టు పరుగు! ఉరకలేస్తూ పరుగే పరుగు!

బిడ్డికోడు కొండమొదల్న మెరకమీద కంపనరుకుతూ వున్నాడు. తాతల తండ్రులనుండి చెమటపోసి పదును చేసి మడిగడుతూనే వున్నాడు. తలెత్తిచూసాడు. తెల్లకారు, మట్టిరోడ్డమ్మట దుమ్మురేపుకుంటూ వచ్చి ఆగింది. ఊరు అక్కడే దార్లోనే బస చేసినట్టుంది. బిడ్డికోడు కదిలాడు. బూగడు తండ్రిని కేకేసుకుంటూ పారిపోయాడు.

గుజ్జువాయితో పాటు చుట్టుపక్కల గూడేలన్నీ జాతరకు కొండ దిగుతున్నట్టు దిగబడిపోవడంతో బిడ్డికోడుకి కళ్లముందు గొర్రెల మందే కదలాడింది. ఒక్కటి పరుగుతీస్తే దాని వెనకే మిగతావి పరుగుతీయడం ఎందుకో గుర్తుకు వచ్చింది. నిట్టూర్చాడు. అడుగులు నెమ్మదించాయి. కాని దార్లో అవుపడ్డ బొంత బిడ్డికిని గాబరాపెట్టి నడిపించాడు.

బంతి భోజనాలకు కూర్చున్నట్టు అంతమందీ రోడ్డుమీద మట్టిపైనే కూర్చుండిపోయారు.

''... అంచేత ఎప్పుడూ లేని అవకాశం... బంగారంలాంటి అవకాశమొచ్చింది చెప్పండి ఎవరెవరికి ఎన్నేసి ఎకరాల భూమివుందో ఎంతేసి కేటాయించగలరో.'' ప్రాజెక్టు ఆఫీసరుగారి పియ్యే టయ్యి సర్దుకున్నాడు.

''... అదేటి బావు సెక్కోముక్కో భూమి పంచుతారని మావొస్తే. తిరగి మాకాడ ఎన్నేసెకరాలున్నాయని ఎకసెక్కాలాడతన్నారు... మా బాగుంది కత''... పోలేసు కూర్చున్నోడు లేచి నిలబడిపోయాడు.

'' ఎకసెక్కాలు కాదు, పరాచికాలు కాదు... పర్టిక్యులర్స్ కావాలి. ఎందుకంటే భూమి వున్నోళ్లకే చెఱువులు ఎలాట్ చేయ్యగలం... తవ్వించగలం. ఆసక్తి వున్నోళ్ళు ఒక్కొక్కరూ పేర్లివ్వండి...

అందరూ ఒకరి మొగమొకరు చూసుకున్నారు. గుసగుసలాడుకున్నారు. కాని ఒక్కరూ ముందుకు రాలేదు.

అప్పుడు ప్రాజక్టు ఆఫీసరే బోధపరిచాడు.

''... నేను కూడా మీలాంటి కుటుంబాల్నుంచే వచ్చాను. ఇవాళ ఆఫీసర్ని ... అయినా మీ మంచి చెడ్డలు నావేనని అనుకొని వచ్చాను. చెప్పండి. మీ ఇబ్బంది ఏమిటో...'' గొంతునిండా ఆప్యాయత వుంది.

చాలా చేతులు ఆమాటకే చలనమొచ్చి లేని దండమెట్టాయి. మళ్ళీ గుసగుసల శబ్దం.

''కలెక్టరుగారు మన జిల్లాలో అయిదు వందల చెఱువులు తవ్విస్తున్నట్టు ప్రకటించారు. మన పార్వతీపురం ఐ.టి.డి. పరిధిలో నూటయాభై అయిదు చెరువులకు అవకాశమిచ్చారు. కురుపాం. కొమరాడ, మక్కువ, సాలూరు, జియ్యమ్మవలస మండలాలతో పాటు మీ గుమ్మలక్ష్మీపురం కూడా వుంది,... ప్రాజెక్టు ఆఫీసరు నోటుబుక్కులో వున్నది చూసుకుంటూ చెప్పాడు.

బిడ్డికోడికి అంతా అయోమయంగా అర్థంకాకుండా వుంది. ముడుకులమీద కూర్చున్నోడు లేచి అడిగేసాడు.

''మా గుజ్జాయి పెద్దగెడ్డ రిజరోయరు నీరే మాకందదు, ఆరొందలెకరాలకి అందుతాద ని అప్పుడు లెక్కలు సెప్పినారు. అరవై ఎకరాలకే అవస్థయిపోతంది. మొక్కా మోడు బలిస్సి, ఘన్నూగట్రా నిండిపోయి నీరుపారదు. మదుమూ తూములూ పాడైపోనాయి. సెరువుల్తోటి పంటేటి పండిస్తామికన...?''

''వ్యవసాయం కోసం చెరువులు కాదు, చేపలు పెంచడానికి చెరువులు-చేపల చెరువులు,, బిడ్డికోడి అయోమయాన్ని పోగొట్టానని అనుకున్న పియ్యే బిడ్డికోడిని, మరింతమందిని అయోమయంలోనూ అనుమానంలోనూ పడేసాడు.

''రిజర్వాయర్ బాగుకు ఫండ్స్ గవర్నమెంటు నుంచి రాలేదు....'' ప్రాజెక్టాఫీసరు పొడిగా సమాధానమిచ్చేడు.

''చేపల చెఱువులా?'' బుదడు ఆనందంగా అరచి, గుంపుకు వెనకాతల వున్నవాడల్లా ముందుకు వచ్చాడు. చదవడమూ రాయడమూ వచ్చిన బుదడు ఆ క్షణాన అక్కడ వుండడం ఆశ్చర్యమే. వాడు నెలకు వారం రోజులు ఊర్లో వుండడం కష్టం.

'' ఈయన పేరు రాయండి'' ప్రాజెక్టాఫీసరు అన్నాడు.

''బుదడు, ఓల్డు ఫిఫ్త్‌క్లాసు'' గొప్పగా చెప్పుకున్నాడు బుదడు.

''మీ భూమి ఎక్కడుందో, చూసొద్దాం...'' పియ్యే రాసుకుంటూ బుదడ్ని అడిగేడు.

''సెవెన్టీ ఫైవ్‌లో చేపల పెంపకం ట్రైనింగ్ అయ్యానండి...'' బుదడు చెప్తూ చేతులు నులుముకొని రాని నవ్వునవ్వాడు.

''వెరీగుడ్'' ప్రాజె క్టాఫీసరు, మెచ్చుకున్నాడు.

''మీ భూమి...'' పియ్యే ఆడగబోయాడు.

''లేదండి.. భూమి లేదు... '' తప్పు చేసినవాడిలా తలదించాడు బుదడు.

''సారి... భూమివుంటేనే లేకపోతే ఏం చెయ్యలేం. చెరువు శాంక్షన్ చేసేమే అనుకో... ఎక్కడ తవ్వుతాం?'' పియ్యే వెంటనే వివరించేసేడు.

''బాబ్బాబు... మీరే'' బతిమలాడ బోయాడు బుదడు.

''సారీ.... కుదర్దు... నువ్వెళ్లు... భూమి వున్నోళ్ళెవరయినా ముందుకు రండి అసలే టైం తక్కువుంది.'' ప్రాజెక్టాఫీసరు చెప్పాక బుదడు అసహనంగా రోడ్డు దాటి వెళ్లిపోయాడు.

''మారాజా., మాకున్న భూములన్నీ మెరక భూములు. కొండ మొదల్నవున్న జాగాలో సెరువులా?'' బొడ్డుడుకీ అనుమానం తీరలేదు.

'' ఎక్కడున్నా బాధలేదు, తవ్విచ్చే పూచీ మాది. మీరు ముందుకు రావడమే కావాలి. మిగతావన్నీ మేం చూసుకుంటాం. మీ డెవలప్‌మెంటే మాక్కావలసింది. మీ పేరు?'' ప్రాజెక్టాఫీసరు అడిగేసరికి అవుననాలో కాదనాలో తెలీకపోయినా తెలిసినా తన పేరుమటుకు చెప్పేసాడు, బొడ్డు.

కొండ మీద చెఱువు లేమిటో అర్థం కాకపోయినా బొడ్డు పేరు మొదటిదయి ''నమోదయింది. మొదటున్న వారికే మొదట. ఆఖర్ని వున్నవారికి ఆఖర్నవుండొచ్చు.... వుండక పోవచ్చు.'' అనడంతో ఒకరొకరూ ముందుకొచ్చారు. పోటీ పడి పేర్లిచ్చారు.

కొండడు, బూగడు, లక్కాయ్, సాంబ్ర నలుగురూ తమ పేర్లిచ్చేసాక బిడ్డికోడు తేరుకొని అడ్డం పడ్డాడు.

''లేకియర్స్,... లక్షాధికారులైపోతార్రా... మీ దశ తిరిగింది... అదృష్టమంటే మీదే, మీ ముసిలోడితో ఏటి, ఏదీకానివ్వడు దగుల్బాజి లంజికొడుకు... '' పియ్యే బిడ్డికోడి నలుగురు కొడుకుల్ని భుజం మీది చెయ్యివేసి అభినందించేడు.

'లక్షాధికారులం కాకపోయినా లేకిబికారోళ్ళం మాత్రం కాకూడదు, వద్దు' బిడ్డికోడి నోటంట మాటరాకముందే కొడుకులు అడ్డుకున్నారు.

''నోరుమ్మంయ్య... నలుగుర్లోటీ మునమున్నా... అయినా నువ్వు అనుమానించందేటి? నీకేటి తెల్దు నువ్వొల్లకో...''

బిడ్డికోడి మాట చెల్లలేదు. మనిషినీ ఎవ్వరూ పట్టించుకోలేదు.

ప్రాజెక్టాఫీసరు, పియ్యే ఇంకా ఫీల్డాఫీసర్లు అంతా సర్వేకని భూముల మీదికి ఎగబడ్డారు. బిడ్డికోడి గుండెజారి నేలన కూలబడ్డాడు!

★★★

కుక్కి మంచంలో చేరగిలబడివున్న బిడ్డికోడు సలపరించిన నొప్పులకు తాళలేక ముక్కుతూ మూల్గుతూ వున్నాడు.

సిరిమిల వేపుడునూకల తెట్ట మరిగించి పెనిమిటున్న మంచం దగ్గరకు తీసుకువచ్చింది. తెట్ట ఆవిర్లు కక్కుతూ వుండడంతో దాకలోంచి లోటాలోకి లోటాలోంచి దాకలోకి వంపి చల్లారబెట్టింది. బిడ్డికి నుదిటమీద గుండె మీద చెయ్యివేసి చూసింది.

'ఓలమ్మో ఇంకా కాలిపోతందే...' స్వగతంగా పైకే సిరిమిల.

ఇంతలో 'సిరిమిలా.. ఓ.. సిరిమిలా, గుమ్మంలోంచి పిలుపు వినబడ్డంతో, సిరిమిల అరుగుమీదనుండి గుడిసెదాటివచ్చింది. ఎదురుగా జాదవ కత్తికూడు.

'కషాయిమిదే.. బిడ్డిక్కి...'' కత్తికూడు గిన్నెతో ఇచ్చి వెళ్లింది.

కూతురు లిక్కిడి వచ్చి బిడ్డికి మంచం పక్కనే చేరింది.

సిరిమిల బిడ్డికిని లేపి కూర్చోబెట్టి కషాయమిచ్చింది. కళ్ళు మూసుకుంటూ తాగి, మళ్ళీ అదే కుక్కి మంచంలో వెనక్కి వాలిపోయాడు బిడ్డికోడు.

పెనిమిటి ముఖం చూస్తూ కాళ్ళకాడే కూర్చుండిపోయింది సిరిమిల.

కొద్దిసేపటికి సిరిమిలికి కూటిరెప్పపడుతుండగా బిడ్డికోడు ఉలిక్కి పడుతూ దిగ్గునలేచి కూర్చున్నాడు. సిరిమిలికి నిద్రవదలిపోయింది. లిక్కిడి మంచం మీద నుండి లేచి నిల్చొంది. బిడ్డికోడు అయోమయంగా బెదురుతూ చూసాడు.

'' ఏటయ్యిందే... సపనమేమిటే.. ఏటయ్యిందే?'' సిరిమిల పెనిమిటిని కుదపబోయింది. బిడ్డికోడు ఆమెను వారించి, సత్తువ లేని శరీరాన్ని మళ్ళీ మంచంమీదకి వాల్చాడు. వెల్లకిలా వున్నవాడల్లా బోర్లా పడుకున్నాడు. అతని కళ్ళు తడిచి బొట్లురాలాయి.

బిడ్డికోడికి వొరిగిపోయిన కాలం జ్ఞాపకానికొచ్చింది. ఆజ్ఞాపకాల్లో... మనిషిని నిలువునా కప్పెట్టేటంత లోతుతో విశాలంగా చెరువులు... గట్టుమీద గంజినీళ్ళు తాగుతూ మురిసిపోయి కొడుకులు... ఆకలి తీరని రాకాసిలా ఆపకుండా తవ్వుకు పోతూ వున్న బుల్డోజర్లు... కార్లూ జీపులూ, కళ్లద్దాలూ గళ్ళ తెల్లచొక్కాల నవ్వులు...

''మీరెదగరయ్యా... ఎదగరు.. గవర్నమెంటుకి బుద్ధిలేదు, మీకు బుద్ధిరాదు. ఫ్రీగా ఇస్తే ఫినాయిలు తాగే కాలంలో వత్తినే చెఱువులు తవ్విస్తాం రండి రా అంటే మీకింత తీపరమా? మా అగ్రోస్ సర్వీస్‌లోనే ఇలాంటి కేసులెరగమయ్యా.. అయినా నాకర్మకాలి మీ జిల్లాలో పడ్డాను. అదే ఈస్ట్‌వెస్ట్ గొడావరి, ఏలూరయితేనా ప్రైవేటు పార్టీలు అదిరిపోను..''

''మీకేం పోయిందయ్యా చెరువుకి ఎకరాకి ముప్పైమూడు వేలవుదే. అందులో ఐ.టి.డి. ఏ ట్వంటీ పర్సెంటు, ఫిషరీష్ ఫార్మింగ్ డెవలప్‌మెంటు ఏజెన్సీ ఫార్టీ పర్సెంటు రుణంగా ఇస్తుంటే మీకేం సలుపో.''

''అవమ్మా'' అన్నాడు బిడ్డికోడు. దూరంగా వినబడుతున్న మాటలేవో మాయమయ్యాయి. కాళ్ళునొక్కుతున్న సిరిమిల పెనిమిటి మూల్గు విని చేతులు వెనక్కి తీసుకుంది.

బిడ్డికోడు మరొక పక్కకి ఒత్తిగిల్లాడు.

''అమ్మా... సంతకెళ్లమే?'' లిక్కిడి తల్లిని అడిగింది.

ఇప్పపూలమ్మడానికి సంతకి వెళ్లడం సిరిమిలకి గుర్తొచేది. ఇప్పుడా అవసరంలేదు. ఇప్పుడు ఇప్పసెట్టన్నది లేదు. చెఱువులు తవ్వినప్పుడే వాటిని తవ్వి తొక్కిపడేసారు. ఇప్పసెట్లు కూలిపోవడం కాదుగాని సిరిమిలకి సెయ్యి ఇరుసుకున్నట్టుగా వుంది. పూలు లేనేలేవు. పిక్క ఆద్రూపాయలు కేజీకెల్లీవి. నూనె. సారా.. అన్నీ బంద్! మామిడి సెట్లూ లేవు. టెంకంబలీలేదు.

కందులూ చోడీ జొన్న మెరకపంట ఏదీ సున్న!

ఇప్పుడు కట్టెలమ్ముకోవాలి!

అందుకే కోడళ్ళు సుక్కి, బూదితో లిక్కిడి కూడా కట్టెలమోపు నెత్తినెట్టుకొని సంతకెళ్ళింది.

ఇదంతా చూసి సిరిమిలకోక కళ్లుతుడవలేక తడిచింది.

బిడ్డికోడు బలవంతంగా కళ్ళు మూసాడు. మూసిన కళ్ళకు కనిపించిందేదో కడుపంతాదేవేస్తూ వుంది.

''పండగొంటి పూట పిసర దుమ్ముకుక్కాడా దిక్కులేని ఇల్లైపోయింది. ఛీ..ఛీ.. దరిద్రమిల్లు. దరిద్రం బతుకు'' అందరికీ చిన్నోడు బూగడు బుగ్గలు వేలాడేసి తల్లితో యుద్ధానికి దిగాడు.

''తినీగానేటి సొరగమైపోద్దిరా? లేకపోతే నాలికిమీదలాగ వుండిపోద్దా? ఈ తోవనెల్లి ఆతోవ సీకటి రాజ్జింల పడిపోడమేకదా?'' సిరిమిల సర్దిచెప్పబోయింది.

'' ఏదాంతమొద్దు. ఎందుకొక్కడి కొయ్యనీదు?'' బూగడిదదే ప్రశ్న.

''అమ్మితే అరవై రూపాయలొస్తే, ఆ పండగనాడైనా వరికూడు కుటమానం నలుగురుతిందుమని నానే కోడమ్మేసి గింజలు కొనుక్కొచ్చినాను..'' బిడ్డికోడు చేసిన తప్పు తనదే అన్నట్టు మాటరానట్టు చెప్పాడు. దుఃఖం మరిమాటల్ని పెగలనివ్వలేదు.

అదీ బుల్డోజర్లు నడిపినోళ్లకి- కూడు... వరికూడు... కోడి కూర... సారాకాచి రెండుపూటలా మోసికెళ్ళినైవేద్యం పెట్టిన నలుగురు కొడుకులూ బిడ్డికోడికి గుర్తుకొచ్చారు. ఆలంతా బుక్కుతూ వుంటే వట్టి బుగ్గలు చప్పరించిన బూగడు మరీ మరీ కళ్ళముందు మెదిలాడు.

బిడ్డికోడు మంచంమీద నుంచి దగ్గుకెర్లుకొస్తే తట్టుకోలేక లేచి కూర్చున్నాడు. దగ్గిదగ్గి అలసి జాపోసిపోయాక అలాగే సేదతీరాడు.

సిరిమిల కాసేపాగి తెట్టతాగమని ఇచ్చింది. పెళ్ళాం మరీ బలవంతం చేస్తే రెండు బుక్కుళ్ళు తాగి మళ్ళీ వాంతి చేసుకున్నాడు.

మట్టినేల ఆవాంతిని కూడా ఆకలిగా పీల్చుకుంది.

★★★★

ఆరుమాసాల కాలం తిరిగింది!

బిడ్డికోడికి కాలూచెయ్యీ ఆడి, లేచి తిరిగాడి తొలేత చేపల చెరువులకాడికే వెళ్ళాడు. అల్లంత దూరం నుండే అవన్నీ పెద్దపెద్ద గోతుల్లా అగుపించాయి. దగ్గరకొచ్చి చూస్తే గిరిజన గూడేలన్నింటిని చెరువు కడుపులో పెట్టి కప్పేయొచ్చుననిపించింది.

బిడ్డికోడికి చెరువు గట్టు ఎక్కుతుంటే ఒళ్ళు జలదరించింది. ఒక్క క్షణం తలతిరిగి తూలిపడబోయి ఆసుకున్నాడు. మట్టిని చేతుల్లోకి తీసుకొని అప్యాయంగా చూసుకున్నాడు. కళ్ళమ్మట బొట్లు టపటపరాలాయి. దోసిళ్ళలోని మట్టిలో రాలిన కన్నీళ్ళు ఇంకిపోయాయి.

కొద్దిసేపటికి తేరుకొని బిడ్డికోడు చెరువుగట్టు పూర్తిగా ఎక్కాడు. కనుచూపుమేరంతా చెరువులే! ఎండిన నేల ఎడారిగా వుందే గాని మునపటి పచ్చదనం కానరాలేదు. బిడ్డికోడు ఎక్కువసేపు చూడలేక అలాగే కాళ్ళు విరిగినట్టు గట్టుమీద మట్టిలో కూర్చుండిపోయాడు.

ఎండచుర్రున మండుతోంది. వెచ్చటిగాలి తిరుగాడుతోందే తప్ప చెట్టూ పుట్టాలేక ఒక్క పక్షీ వాలిన గూడు, ఎగిరిన జాడ అవుపడలేదు. తేమలేక ఎండకు మండి వాసన్ని కోల్పోయింది. ఇన్నాళ్ళూ ఆ మట్టివాసనే బిడ్డిక్కి గుండెతో పాటు కడుపూ నింపేది.

ఇంతలో కలకల శబ్దం!

దిగువ చెఱువు కడుపులో జనం...

బిడ్డికోడు సత్తువ తెచ్చుకొని అటుగా వడివడిగా అడుగులు వేసాడు. ప్రాజెక్టాఫీసరు,

అతగాడి పియ్యే ఇంకా ఫీల్డు ఆఫీసర్లు ఎవరెవరో... అందర్నీ చుట్టుముట్టిన గిరిజనులు...

అంతా గోలగోలగా వుంది. ఎవ్వరి మాట స్పష్టంగా వినిపించడం లేదు. బిడ్డికోడు మందలో కలిసాడు. మాట వినిపించింది. గోల అర్థమయింది.

''చెరువులు తవ్వి ఆరుమాసాలయింది. చేపపిల్లలు ఇదిగో ఇస్తాం. అదిగో ఇస్తామని అంటన్నారేగాని ఇచ్చింది లేదు సచ్చింది లేదు... నాకు తెలీక అడుగుతాను చేపిల్లలుగాని ఇంకపెద్దవి కాలేదేటి?'' బుదడు నిలదీస్తున్నాడు.

''నీకు చెరువులేదుగా, నీకెందుకు'' ఎవరో బుదడికి సంబంధం లేదన్నట్టుగా మాట్లాడుతున్నారు.

బుదడేసిన ప్రశ్నే బొడ్డుగాడు వేశాడు.

మరికొంత మంది అలగడుంగు... 'అర్థలగడుంగు...' అని బొడ్డుగాడికి వత్తాసుపలికారు.

''వలలకి, ఆహారానికి అర్జర్లిచ్చాం...'' పియ్యే చెప్పబోయాడు.

''చేపలే లేకంట - ఆటిని పట్టడానికి వలలు... ఆటిని మేపడానికి ఆహారమూ.. అబ్బో...'' వెక్కిరింతగా నవ్వి అన్నాడు బుదడు.

సర్దిచెప్పడానికి ఆఫీసర్లు తడబడ్డారు.

ప్రాజెక్టాఫీసరు మటుకు నమ్మకం కలగడానికనేమో జరిగిన నిజం దాయకుండా చెప్పాడు.

''... తాటిపూడి, రావాడ, రామభద్రపురం, డుమ్మంగిలలో చేప పిల్లల విత్తనాలు లక్షలు ఖర్చు పెట్టి వేసాం. అందులో డెబ్భై అయిదుశాతం చుక్కనీరులేక, వర్షాలు లేక చేప పిల్లలు పెరిగి పెద్దవై అదే కేంద్రాల్లో చనిపోయాయి. మీకూ తెలుసు ఈ ఏడాది వర్షాలు లేవు.. అందుకే ఆలస్యం.''

బిడ్డకోడు అందర్నీ తోసుకుంటూ ముందుకు వెళ్ళి... ''ఆగుబాబు.. నువ్వు సేపపిల్లలిస్తావ్. నిజమే! అసలు ఇందంటా సుక్కనీరు నేదు. మీరట్టుకొచ్చి ఇచ్చినా ఆసేప పిల్లలు ఇందంటయినా సచ్చుండేవి. ఏ సెరువులోనా సుక్కనీరునేపోతే నీరుగురిండి మానేసి సేపపిల్లగురించి జమిలేటట్రా?'' దగ్గు, దాంతో ఆయాసమొచ్చి ఆగిపోయాడు.

అప్పుడందరూ అసలు సమస్యను గుర్తించినట్టు నోళ్ళు వెళ్ళబెట్టారు. కొద్దిసేపు నిశ్శబ్దం..

ప్రాజెక్టాఫీసరు వెంటనే ఇరిగేషన్ డిపార్ట్‌మెంటుకు కబురంపి ఇంజినీర్నుని రప్పించారు. వచ్చిన వాళ్ళు వల్లకాదని చేతులెత్తేసారు. పెద్దగెడ్డ రిజర్వాయరు తూములూ మదుములూ కాలువలూ బాగుచేయించి, వర్షాలు కురిసి నీరు ఎగదంతే అప్పుడవుతుందన్నారు.

అవన్నీ శక్తికి మించిన పనని పివోగారు తేల్చేసుకున్నారు. పియ్యేని పీల్డాఫీసర్లని ఏంచేద్దుమన్నట్టుగా చూసి- 'మోటర్' అనీ, 'డైరక్టు కరెంటు పనికిరాదనీ' 'ట్రాన్స్‌పవర్ మీటర్' వుండాలని తర్జనభర్జనలు పడ్డారు. తేల్లేదు. 'జనరేటర్ పెట్టిస్తే - ఆపరేటింగ్ రాదే..? మళ్ళీ దాన్ని ఎవరికి అప్పగించాలి? ఎవరెవరికి ట్రైనింగ్ ఇవ్వాలి?' పీవోగారు తలపట్టుకున్నారు.

''కష్టంసార్ .. రేపు చేపలు పెంచినా అమ్మకం - కొనుగోలు ఈ జనానికి తెలీదుసార్... అందుకూ మనమే ఎవర్నో రిక్రూట్ చెయ్యాల్సి వుంటుంది. వాటికీ మనమే భారం వహించాలి. ఈపథకం వదిలేసి మరో పథకమేదన్నా...'' పియ్యే పీవోతో చెప్పబోయి చుట్టూ చేరిన నలుగురు ముఖాలు చూసి ఆగిపోయాడు.

చదువు కున్న ఆఫీసర్ల ముద్రలు వేగంగా ఆ విషయాన్ని అర్ధంచేసుకొని 'ఇట్సాల్‌రైట్' అని అంగీకరించాయి ధృవపరిచినట్టు.

మళ్ళీ ప్రాజెక్టు ఆఫీసర్ అన్నాడు.

''మంచి పనికి ఎప్పుడూ ఆటంకాలే. అలాగని పనులు మానుకుంటామా? అసలు మనదేశంలో వర్షాధారం మీదనే వ్యవసాయం ఆధారపడివుంది. అలాంటిది చేపల చెరువుల పెంపకం అందుకెలాగ అతీతమయిపోతుంది? అంచేత ఇవి వర్షాధారమైన చెరువులు. వర్షాలు పడి చెరువులు నిండితే ఏదన్నా చెయ్యగలం.. చేద్దాం... అందుకు నేను హామీ ఆ..''

ఎక్కడి వారక్కడ చేష్టలుడిగిపోయి నిలబడిపోయారు.

తెల్లకారు, దాని వెనకాలే మట్టిరంగు జీపు పోటీ పడుతూ పరుగులెత్తాయో... పారిపోయాయో ఏమో?!

★★★

సంవత్సరం తిరిగింది.!

వర్షాలు నిండి తొణికిసలాడింది. గట్టుల్దాక చేరిన నీరు మట్టిరంగుతో వుండడం మూలాన గట్టూనీరు ఎడతెరిపిలేకుండా ముసురు పట్టి ముంచెత్తాయి! చెరువులనిండా నీరు వర్షపు నీరు తెలీకుండా దూరం నుండి చూస్తే సమానంగా నేలవూదిరి అవుపించింది.

వర్షం కొద్దిగ తెరిపివ్వడంతో ఊరిజనమంతా చెరువుల దగ్గర చేరారు. నీరు నిండడంతో గుండె నిండినట్టే సంబరమయింది. ఆనందం పట్టలేక అప్పటికప్పుడే పార్వతీపురం ఐ.టి.డి.ఏ. ఆఫీసుకు బయలు దేరారంతా.

బిడ్డికోడు వెళ్ళిన కొడుకుల రాకకోసం, కబురు కోసం చెరువు గట్టుమీదే కూకొని

ఎదురుచూస్తూనే వున్నాడు.

పొద్దు కుంకుతుండగా పిల్లలొచ్చారు. కాని వెలుగు నింపుకొని వెళ్ళిన కళ్ళల్లో దీపాలు ఆరిపోయివున్నాయి. నీరసించి పాయిసొప్పకట్టల్లా వేళ్లాడబడిపోయివున్నారు.

''సేప పిల్లలు రాడాకి అయిదారు నెల్లు పడతాదాట''... తెచ్చిన కబురది.

''చేప పిల్లలొచ్చిన్దాక చెరువులో నీలుంటాయేటి... ఈలోగా నీలుసుక్కాలు ఇరిగిపోవూ...?'' ఎవరిదో మాట.

బిడ్డికోడు చెరువుకాడ నుండి గుడిసె వేపు వెనుదిరిగాడు. ఒక్కడూ తనలో తనే గొణుక్కొంటున్నట్టు పైకే అంటున్నాడు.

''... ఇగిరిపోవు... నీళ్లిగిరిపోవు... సేపపిల్లలు వస్తాయి. ఇగిరిపోవు నీళ్లిగిరిపోవు''....

ఆ రాత్రి బిడ్డికోడికి ఆందోళనతో అరకొరగా నిద్రపట్టింది. నిద్రలో కలకూడా వచ్చింది. కలలోకూడా చేపల చెరువులే! చెరువు నిండి కిలకిల లాడుతూ చేపలే చేపలు! ఆ చేపలు క్షణక్షణానికి పెద్దవవుతున్నాయి. అవి ఎగిరి డబ్బుమని మళ్లీ నీళ్లలో పడుతున్నాయి. అవి అలా పడ్డప్పుడు గట్టుమీద వున్నబిడ్డికి నీళ్ళు తుళ్ళి తడిచిపోతున్నాడు. ఆ ఆనందంలో వాటికి మరింత ఆహారం పెడుతున్నాడు. అవి మరింత పెరిగి చేతిలోని ఆహారం అందుకుంటున్నాయి. అయినా వాటి ఆకలి తీరడంలేదు. అందులో పెద్దచేపొకటి బలంగా బిడ్డికోడిని నీళ్ళలోకి లాగేసింది. అలాలాగిన చేపే మింగిందో... మిగతా చేపలన్నీ చేరి ముక్కలు ముక్కలుగా కొరుక్కుతిన్నాయో.

బిడ్డికోడు ఉలిక్కిపడి నిద్రలేచాడు. ఒళ్ళంతా తడిచివుంది. నిజంగా నీటిలోపడి నట్టుగానే గుండె పెద్దగా కొట్టుకుంటోంది. చెమటతో బట్టలు కూడా తడిచివున్నాయి.

బిడ్డికోడు కుక్కి మంచందిగి, గుడిసె బయటకు వచ్చాడు. వాన వెలిసినట్టూ కాక, కురుస్తున్నట్టూ కాక వుంది వాతావరణం. ఆకాశం నల్లగా వుండి గుడుగుడమంటోంది. చీకటీ...చీకటి! దూరంగా వున్న చేపల చెరువుల నుండి అందులో చేరిన కప్పలశబ్దం బెకబెకమంటూ వినిపిస్తోంది ఆశబ్దం విన్నకొద్దీ వికృతంగా వుంది.

రచనా కాలం : అక్టోబర్ 1995

ప్రచురణ : నాగావళి కథలు 1995.